మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- మహబూబ్‌నగర్, జడ్చర్లలో ముస్లింల భారీ ర్యాలీ
- ర్యాలీకి స్వాగతం పలికిన ఎమ్మెల్యే యెన్నం, తదితరులు


ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి మక్కా మదీనా చిత్రపటం అందజేస్తున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా ఆదివారం సాయంత్రం అసర్ నమాజు అనంతరం జిల్లా కేంద్రంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయా కాలనీల నుంచి సమూహంగా తరలి వచ్చిన ముస్లింలు క్లాక్‌టవర్ నుంచి బయలు దేరారు. 'నారే తక్బీర్ అల్లాహ్ హో అక్బర్, నారే రిసాలత్ యా రసూలుల్లాహ్' అంటూ నినాదాలు చేస్తూ అశోక్‌టాకీస్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, న్యూటౌన్ చౌరస్తా మీదుగా షాషాబ్‌గుట్ట దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం షాషాబ్‌గుట్ట పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ అధ్యక్షతన ధార్మిక సభ నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ధార్మిక వేత్త మౌలానా అహసాన్ బిన్ మహ్మద్ ధార్మిక సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో మతపెద్దలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖౌమీ ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం

అంబేడ్కర్ చౌరస్తాలో ఖౌమీ ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఎన్పీ వెంకటేశ్, చంద్రకుమార్ గౌడ్ తదితరులు ర్యాలీకి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో కులమతాల కతీతంగా సుఖసంతోషాలతో జీవిస్తూ ఐకమత్యంతో ఉండాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. ర్యాలీలో పలు సంస్థల వారు షర్బత్, నీళ్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో రఫీక్ పటేల్, ఇంతియాజ్ ఇసాక్, మజహర్ షహీద్, అబ్దుల్ హాదీ, జాకీర్ అడ్వకేట్, అబ్దుల్ జకీ, అఫ్రోజ్‌షా, జహీర్ అఖ్తర్, సిరాజ్‌ఖాద్రీ, అజ్మత్‌అలీ, అవేజ్, జహంగీర్‌పాషా ఖాద్రీ, ఇలియాజ్ ముజాహిద్, షాఫైసల్ పాల్గొన్నారు.


జడ్చర్ల పట్టణంలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

జడ్చర్ల టౌన్: మిలాద్ ఉన్ నబీ పర్వదినం పురస్కరించుకుని జడ్చర్లలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. మైమన్ మజీద్ నుంచి నిమ్మబావిగడ్డ, గంజ్, నేతాజీచౌరస్తా, సిగ్నల్‌గడ్డ, క్రాస్‌రోడ్డు, హౌజింగ్‌బోర్డు కాలనీ, కావేరమ్మపేట మదర్సా వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీ సందర్భంగా మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ జానకి పర్యవేక్షించారు. సీఐ కమలాకర్ నేతృత్వంలో ర్యాలీకి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రక్తదాన శిబిరం

మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో మదర్సా వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో 180 మంది రక్తదానం చేశారు. అక్కడే అన్నదానం చేశారు. రక్తదాన శిబిరం, అన్నదానం మిలాద్ కమిటీ అధ్యక్షుడు మిస్కిన్ పాష, కార్యదర్శి యాసర్‌లు పర్యవేక్షించారు.

ప్రత్యేక బందోబస్తు



మహబూబ్‌నగర్ క్రైం: మిలాద్ ఉన్– నబి ర్యాలీ సందర్భంగా పట్టణంలో పోలీసులు భద్రత ఏర్పాటుతో పాటు ముఖ్య కూడళ్లు, రోడ్లపై తనిఖీ నిర్వహించారు. ర్యాలీ ప్రశాంతంగా నిర్వహించడానికి ముందస్తుగా డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ర్యాలీ సమయంలో ట్రాఫిక్ సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

ఆలయాల మూసివేత



జడ్చర్ల టౌన్: చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని ప్రసిద్ధ గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంతో పాటు అన్ని ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. గంగాపురం ఆలయంలో పూజలు నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నారు. పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, జాతీయరహదారిపై గొల్లపల్లి వద్ద ఉన్న లలితాంబికా ఆలయం, వాసవికన్యకాపరమేశ్వరి ఆలయం, సకలదేవతల ఆలయం, రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయం, భాగ్యేశ్వరాలయంతో పాటు మిగిలిన ఆలయాలు మూసి వేశారు.

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయం, చెన్నకేశవస్వామి దేవాలయం, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసి వేశారు. ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహం సందర్భంగా మూసి వేశారు.

ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

దేవరకద్ర: చదువుకు దూరమైన 14 నుంచి 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఓపెన్ ఇంటర్మీడియేట్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంఈఓ బలరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు మండలంలోని ఉపాధ్యాయులు తమ గ్రామాల పరిధిలో చదువుకు దూరమైన 14,15 ఏళ్ల వారిని గుర్తించి దేవరకద్రలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చేర్పించాలని కోరారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు



దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని గోప్లాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారిపైన చెట్ల కింద ప్రజలు సేద తీరడానికి ఆదివారం సిమెంట్ బెంచీలను వేయించారు. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల వెంకటన్న జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రోళ్ల హన్మంతు సిమెంట్ బెంచీలు వేయించారు. పలువురు గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని కాటవరం స్టేజీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం .. మహబూబ్‌నగర్‌కు చెందిన 6 మంది బొలెరోలో వినాయక నిమజ్జనం కోసం కొత్తకోట వైపు వెళ్తుండగా కాటవరం స్టేజీ సమీపంలో స్పిన్నింగ్ మిల్లు వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరోలో ఉన్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రొద్ద లింగం, మరో ఇద్దరు కిరణ్‌కుమార్, రాధేశ్యామ్‌లకు గాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురు ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారిని స్థానికులు జిల్లా కేంద్రానికి తరలించారు. బొలెరో డ్రైవర్ చెన్నంగిరి రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మైసమ్మ ప్రసాదాల వేలం

నవాబుపేట: మైసమ్మ దేవాలయంలో లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయాల కు సోమవారం వేలంపాట ఉంటుందని దేవాలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఈఓ. నర్సింహులు తెలిపారు. ముందుగా దేవాలయం పేరుతో రూ. లక్ష డీడీతో వచ్చినవారు మాత్రమే టెండరులో పాల్గొనాలని వారు వివరించారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 1 గంటకే మైసమ్మ ఆలయం మూసి వేసినట్లు, సోమవారం దేవాలయంలో అమ్మవారు ఉదయం 7.30 గంటలకు భక్తులకు దర్శనం ఇస్తారని వారు ఈ సందర్భంగా వివరించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా తిప్పారెడ్డి

దేవరకద్ర: కౌకుంట్ల మండలం ఇస్రంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న టీ.తిప్పారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. విద్యాభివృద్ధికి ఆ యన చేసిన సేవలకు గుర్తింపుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఇది తనకు ఎంతో ఆనందాన్ని, తగిన గుర్తింపు వచ్చిందని తిప్పారెడ్డి తెలిపారు.

లక్ష్యం కోసం అహర్నిశలు శ్రమించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ జానకి

జడ్చర్ల టౌన్: జీవితంలో ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని, దాని సాధనకు అహర్నిశలు శ్రమించాలని ఎస్పీ జానకి అన్నారు. క్రీడలతో జీవితంలో క్రమశిక్షణ అలవడుతుందని ఆమె సందేశమిచ్చారు. ఆదివారం బాదేపల్లి జెడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఫ్రెండ్లీ ఖోఖో టోర్నీని ఆమె సందర్శించారు. మిలాద్ ఉన్ నబీ ర్యాలీ పర్యవేక్షణ నిమిత్తం పట్టణానికి వచ్చిన ఎస్పీ హైస్కూల్ మైదానానికి వెళ్లారు. ఖోఖో టోర్నీ నిర్వహిస్తుండటంతో క్రీడాకారులను కలుసుకుని స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా దృఢత్వం కలుగుతుందని, జీవితంలో కలిగే అన్ని పరీక్షల్లోనూ విజయానికి దోహద పడుతుందన్నారు. గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని దానిని సాధించేందుకు అహర్నిశలు శ్రమించాలన్నారు. ఫ్రెండ్లీ టోర్నీలో రాజాపూర్, తిర్మలాపూర్, మద్దూర్, బాదే పల్లి, ప్రేరణ బ్రిలియంట్, కోడ్గల్, పెద్ద ఆదిరాల ఉన్నత పాఠశాలల ఖోఖో జట్లు తలపడ్డాయి. వాటిలో మద్దూర్ హైస్కూల్ విజేతగా నిలిచింది. పీడీలు వడ్డెన్న, రాములు, వెంకటమ్మ, శారదబాయి, అశోక్, సత్యం, మోయిన్, ప్రై వేట్ పాఠశాలలకు చెందిన పీఈటీలు బాల్‌రాజు, సందీప్, విజయ్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సమాజం మరువదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: ఉత్తమ ఉపాధ్యాయులను సమాజం ఎప్పుడూ మరువదని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని గాధిర్యాల్ గ్రామానికి చెందిన కొండమొల్ల వెంకటయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. సమాజ నిర్మాణం కోసం పరితపించిన వ్యక్తి అని, అలాంటి వ్యక్తిని విద్యార్థులు తోటి స్నేహితులు ఎప్పుడూ మరువలేరన్నారు. పరిగి నియోజకవర్గంలో ఎక్కడ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరిగినా అక్కడ వెంకటయ్య సార్ తప్పకుండా ఉంటాడని, నియోజకవర్గ ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘ రాష్ట్ర నా యకులు జేబి రాజు ప్రముఖ వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా 30 అడుగుల వెంకట య్య సంస్మరణ స్థూపాన్ని ప్రారంభించారు. స్థూపా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కా ర్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, నాయకులు డాక్టర్ ఈ రాములు, హ న్మంతు, లాల్‌కృష్ణ, శాంతిబాయి, ఆయన సతీమణి ప ద్మమ్మ, భరత్, సంధ్యారాణి, డీటీఓ రాంచందర్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు, ప్రజ లు పాల్గొన్నారు.

రజకులు ఐకమత్యంగా ఉండాలి


అన్నాసాగర్‌లో రజక సంఘం నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం

భూత్పూర్: రజకులు సంఘటితంగా కలిసి ఉండాలని, ఐకమత్యంగా ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ. పురుషోత్తం అన్నారు. ఆదివారం మండలంలోని అన్నాసాగర్‌లో రజక సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కె.శివకుమార్, ఉపాధ్యక్షుడిగా కె. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కె.నర్సింహులు, సంయుక్త కార్యదర్శిగా ఆర్.కిషోర్, కోశాధికారిగా కె.రాఘవేందర్, ప్రచార కార్యదర్శిగా కె.శ్రీకాంత్, సలహాదారులుగా కె.పవన్, కె. శ్రీనివాసులు, రమేష్, చిన్న యాదగిరి, డీ.శేఖర్‌లను ఎన్నుకున్నారు.

భూత్పూర్ చౌరస్తాలో కంపు కంపు


భూత్పూర్ చౌరస్తాలో మురుగుతో నిండిన కాల్వ

భూత్పూర్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూత్పూర్ చౌరస్తాలో బిడ్జికి ఇరువైపుల కాల్వలు నిర్మించి కప్పు సైతం ఏర్పాటు చేశారు. కొత్తకోట వైపు వెళ్లే దారిలో కాల్వపై కప్పు వేయకపోవడంతో చికెన్ సెంటర్, హోటల్ వ్యర్థాలు వేస్తున్నారు. ప్రతి ఆదివారం సంతకు చేపల విక్రయాలు చేసే వారు చేపల వ్యర్థ పదార్థాలు వేయడంతో దుర్గంధంతో ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు ప్రతి ఆదివారం సంతలో చెత్త వేయడానికి ట్రాక్టర్ సైతం నిలుపుతారు. ట్రాక్టర్‌లో చెత్త వేయకుండా కాల్వలో వేయడంతో దుర్గంధం ఏర్పడుతోంది. కాంట్రాక్టర్ చొరవ తీసుకోని కాల్వపై కప్పు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

అరుణ్‌కుమార్‌కు ఎమ్మెల్యే నివాళి

దేవరకద్ర: దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ గ్రామానికి చెందిన మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు గోపాల్ కుమారుడు అరుణ్‌కుమార్ పది రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందగా, ఆదివా రం దశదిన కర్మలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పా ల్గొని నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు టీపీసీసీ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, కురుమూర్తి దేవస్థాన కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నా యకులు అంజిల్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కోనరాజశేఖర్, బాలస్వామి, గోవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, జాఫర్ పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో యూరియా పంపిణీ

నవాబుపేట: యూరియా అవశ్యకతను దృష్టిలో ఉంచుకుని మండలంలో సోమవారం మూ డు గ్రామాల్లో రైతులకు యూరియా అందుబాటులో ఉంటుందని మండల వ్యవసాయ అధి కారి కృష్ణకిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు 600 బస్తాలు, కొ ల్లూర్‌కు 900 బస్తాలు, చౌదూర్‌కు 450 బస్తాల యూరియా కేటాయించామని, సోమవారం ఆ యా గ్రామాల్లో రైతులకు అందిస్తామని ఆయ న తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా యూరియాను తీసుకోవాలన్నారు.

9న మండల స్థాయి ఖోఖో పోటీలు

గండేడ్: ఈ నెల 9న మండల స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు వెన్నాచెడ్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం రవిబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆంజనేయులు తెలిపారు. అండర్–14, అండర్–17 ఖోఖో పోటీలు బాలురు, బాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే ఆయా పాఠశాల విద్యార్థులు వారి వారి వ్యాయామ ఉపాధ్యాయ బృందంతో 9న ఉదయం 9 గంటల వరకు వెన్నాచెడ్ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని సూచించారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు ఆధార్ కార్డు, పాఠశాలకు చెందిన బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలని పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

వృథాగా పోతున్న నీరు



చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన పశువుల నీటి తొట్టి వద్ద నల్లకు ట్యాప్‌లేక నీరు వృథాగా పోతోంది. ప్రతిరోజు పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పంచాయతీ కార్యాలయంలోనే ఉంటూ వృథాగా పోతున్న నీరుపై దృష్టి సారించక పోవడంతో గ్రామంలో పలువిమర్శలు వెల్లువెత్తాయి. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల 10 వార్డులో సక్రమంగా మంచి నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప లువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సిబ్బంది పశువుల నీటి తొట్టి వద్ద నల్లాకు ట్యాప్‌ను ఏర్పాటు చేసి నీరు వృథా పోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ముదిరాజుల హామీకి కట్టుబడి ఉన్నాం


మహిళా గర్జనకు హాజరైన ముదిరాజ్ కులస్తులు

మెట్టుగడ్డ: ముదిరాజ్‌ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలన్న డిమాండ్‌తో ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో తెలంగాణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా గర్జన సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లుగా ముదిరాజ్ రిజర్వేషన్ సమస్యను పట్టించుకోకుండా విస్మరించిందన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నారాయణపేట వేదికగా ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చుతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇచ్చిన మాట నెరవేర్చే ముఖ్యమంత్రి మనకు ఉన్నారని, ముదిరాజ్‌లకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముదిరాజ్ బిడ్డ మంత్రిగా ఉన్నారని, ఆయనతో చర్చించి సూచనలు, సలహాలు తీసుకుని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దోరెపల్లి లక్ష్మి రవీందర్, జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎన్పీ వెంకటేష్, మైత్రి యాదయ్య, గోనెల శ్రీనివాసులు, పట్టణ మహిళా అధ్యక్షురాలు సునీత, వెంకటయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు నిర్మాణానికి స్థలం ఖరారు


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్‌షాకీర్

జడ్చర్ల టౌన్: జడ్చర్లలో కోర్టు భవన సముదాయ నిర్మాణానికి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో స్థలం ఖరారు చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్‌షాకీర్ వెల్లడించారు. ఆదివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సీనియర్ సివిల్ జడ్జికోర్టు, అదనపు కోర్టు స్థలం ఎకర 2 గుంటల ఉండగా, అదనంగా ఎకర 8గుంటల స్థలం కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 2 ఎకరాల 10గుంటల స్థలంలో కోర్టుకు స్థలం కేటాయింపులు జరిగాయన్నారు. ఇందుకు సంబంధించిన స్థల దస్తావేజులను తహసీల్దార్ కార్యాలయం నుంచి అందుకుంటున్నట్లు తెలిపారు. 2018లో కోర్టు అదనపు భవనం నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయగా రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరిందని, దానిని తొలగిస్తేనే మరిన్ని నిర్మాణాలు చేయవచ్చని హైకోర్టు న్యాయమూర్తికి సిఫారసు చేశారన్నారు. ఈ క్రమంలోనే 2021–22 ఏడాదిలో కోర్టు నిర్మాణం కోసం మరింత స్థలం కావాలని అప్పటి ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి సిఫారసుతో అప్పటి కలెక్టర్ వెంకట్రావుకు దరఖాస్తు చేసుకున్నామన్నారు. అయితే ప్రస్తుతం కోర్టు భవనం ఉన్న స్థలాన్ని మండల పరిషత్‌కు స్వాధీ నపర్చి రోడ్డు వైపు ఉన్న 1ఎకర8గుంటల స్థలం తీ సుకోవాలని అప్పటి కలెక్టర్ ఆర్డర్ ఇచ్చారన్నారు. స్థలాభావం ఏర్పడుతుందని నాటి నుంచి అనేకమా ర్లు విన్నపాలు చేస్తూ చివరకు మే నెలలో ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ద్వారా జిల్లా కలెక్టర్ విజయేందిరబోయిని కలిశామన్నారు. వారిద్దరి సహకారంతో స్థలంతో పాటు అదనంగా రోడ్డువైపు స్థలం కోర్టుకు కేటాయిస్తూ కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారన్నారు. ప్రొసీడింగ్స్‌ను జిల్లా న్యాయమూర్తి ద్వా రా హైకోర్టు న్యాయమూర్తికి పంపిస్తామని, అనంతరం భవన నిర్మాణంకోసం నిధులు మంజూరవు తాయన్నారు. స్థలం కేటాయింపు విషయంలో సహకరించిన వారందరికి బార్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు టి.శ్రీనివాస్‌గౌడ్, మహేశ్వర్‌రెడ్డి, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, శంకరాచారి, మురళికృష్ణ, రమేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి భారీ గణనాథుడు


నవాబుపేటలో వేలం పాటలో దక్కించుకున్న లడ్డును అందుకుంటున్న భక్తుడు

మహబూబ్‌నగర్ రూరల్: 'గణపతి బప్పా మోరియా.. జై బోలో గణేష్ మహారాజ్‌కి జై' అంటూ మహబూబ్‌నగర్ పట్టణంలోని పాతపాలమూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్యను భక్తిశ్రద్ధలతో ఉత్సవ కమిటీ సభ్యులు గంగమ్మ ఒడికి చేర్చారు. 27 అడుగుల భారీ గణనాథుడిని ఆదివారం మధ్యాహ్నం బీచుపల్లి కృష్ణానదిలో క్రేన్ సహాయంతో నిమజ్జనం చేశారు.

రూ.62,316 పలికిన లడ్డు

గణేష్ నవరాత్రుల్లో వినాయకుడికి నైవేద్యంగా సమర్పించిన లడ్డు వేలం పాటలో స్వాతి 21 కిలోల లడ్డును రూ.62,316లకు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆమెకు లడ్డు అందజేశారు. స్వామివారి కలశం రూ.5,016లకు ప్రభుత్వ ఉద్యోగి టి.నర్సింహులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఎ.శ్రీనివాసులు. టి.శివాజీ, తిరుమల నవీన్, టి.అరవింద్, ఎ.రాము, సుబ్బు, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

లడ్డు వేలంలో ఒకే రోజు రూ.9లక్షలు

నవాబుపేట: వినాయక నిమజ్జనంలో ప్రధానమైన లడ్డు వేలం చాలా జోరుగా సాగింది. శనివారం అర్ధరాత్రి దాకా సాగిన వినాయక లడ్డు వేలం పాటలో మండలంలో ఒకే రోజు రూ.9 లక్షలు లడ్డు వేలంలో వసూలు అయ్యాయి. ప్రధానంగా నవరాత్రులు ముగిసి శనివారం గణపతి లడ్డును వేలం వేశారు. దీంతో మండల కేంద్రంలోని శివాలయంలో లడ్డును రూ.40 వేలకు, రవీంద్ర యువజన సంఘం గణపతి లడ్డును రూ.35 వేలకు నవాబుపేట మాజీ సర్పంచ్ వెంకటయ్య దక్కించుకున్నారు. హనుమాన్ దేవాలయంలో రూ.35 వేలకు కారుకొండ భీమయ్య, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బచ్చు అనంతయ్య రూ.30 వేలకు, ఏకలవ్య సంఘంలో రమేష్ రూ.30 వేలు, యాదవ సంఘం వెంకటయ్య రూ.29 వేలు, రుక్కంపల్లిలో రాములు రూ.50 వేలు, రుద్రారంలో రూ.40 వేలు వెంకటేశ్వర్‌రెడ్డి, పోమాల్లో రమేష్ రూ.25 వేలు ఇలా మండలంలో పలు గ్రామాల్లో లడ్డు వేలం జరిగింది. దా దాపు రూ.9లక్షలు వేలం పాటలో గణపతి లడ్డును దక్కించుకున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న స్నేహితులు

నవాబుపేట: మండలంలోని దేపల్లి గ్రామంలో చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. దేపల్లికి చెందిన మహ్మద్ భార్య అన్వర్‌బేగం మండల పరిధి లోని కొల్లూర్ జెడ్పీ పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదివింది. దీంతో ఆమె కుటుంబానికి స్నేహితుల బృందం శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో రూ.27 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు. సుధాకర్, శ్రీనివాస్, పాపయ్య, మాదవ్, వెంకటయ్య, సత్యం, కృష్ణయ్య, రవి, చారి, జగన్, జనార్దన్, జ్యోతి, లక్ష్మి ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మహబూబ్‌నగర్ రూరల్: దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో ముత్యాల ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

మాల పౌర్ణమి ప్రత్యేక పూజలు


శాంతినగర్‌లో గోవుకు పూజలు చేస్తున్న భక్తులు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం మాల పౌర్ణమి వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. మాంసాహారం ముట్టకుండా గణనాథులను 12వ రోజుల పూజించి అనంతరం పౌర్ణమి సందర్భంగా వారి సాంప్రదాయం మేరకు మాంసాహారం తీసుకుంటున్నట్లు మండల కేంద్రంలోని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆలయంలో గో పూజలు

శాంతినగర్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గోవుకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గో ప్రచారక్ సేవా సమితి ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు పసుపు, కుంకుమ, గంధం బొట్లతో అలంకరించారు. గోమాతకు అలంకరించిన చీరను వేలంలో దొంతు భవాని కైవసం చేసుకున్నారు. పూజల అనంతరం ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో గోప్రచారక్ అధ్యక్షుడు శ్రీనివాసులు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం వెంకటేశ్వర్లు, గొంగ్లె వెంకట్రాముడు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
మహబూబ్‌నగర్ - మహ్మద్ తౌసిఫ్ అలీ - 73969 95582
కోస్గి - కె. రమేష్ - 99486 98552
జడ్చర్ల - పి. అంజనేయులు - 80966 88450

సాక్షి - పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
శ్రీశైలం - 97051 35557
వెంకటయ్య - 90108 69797